సిరుల బంతి

- పండుగ పూట కాసులు కురిపిస్తున్న పూదోటలు
- సమయానుకూలంగా సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న యువరైతు

బంతి తోటలో పువ్వులు కోస్తున్న మహిళ రైతులు

చందుర్తి, డిసెంబర్ 15: అందరిలా కాకుండా వరి సాగుకు స్వస్తిచెప్పి బంతిపూలు సాగు చేస్తూ సిరులు సంపాదిస్తున్నాడు ఒక యువరైతు. మూడపల్లి అనుబంధ గోస్కుల పల్లి గ్రామానికి చెందిన యువరైతు ఆకుల బుచ్చయ్య ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తూ వేలలో సంపాదిస్తున్నాడు. పండుగలకు దిగుబడి చేతికందేలా ప్రయోగాత్మకంగా బంతి పూలను సాగు చేస్తున్నాడు. చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గోస్కులపల్లి గ్రామానికి చెందిన ఆకుల బుచ్చయ్య గతంలో ఉపాధి లేక గల్ఫ్‌బాట పట్టగా, ఆరోగ్య పరిస్థితి బాగాలేక స్వదేశం వచ్చాడు. ఆయనకు రెండున్నర ఎకరాల పంట భూమి ఉన్నది. చిన్నప్పటి నుంచే వ్యవసాయం అంటే మక్కువ ఎక్కువ. గతంలో మెట్ట ప్రాంతమైన చందుర్తి మండలానికి సాగునీటి కష్టాలతో గల్ఫ్‌బాట పట్టిన ఆయన స్వరాష్ట్రంలో గోదావరి జలాలతో సాగునీటి కష్టాలు తీరి సాగు విస్తీర్ణం పెరుగడంతో రెండు ఎకరాల్లో వరితో పాటు 20 గుంటల్లో ఆగస్టులో బంతి పూల తోటను సాగు చేశాడు. ఇందుకు 3,200 పెట్టుబడి పెట్టాడు. సట్టి వారాలు, పెండ్లిళ్లు, అయ్యప్ప దీక్షల సమయంలో రూ.లక్షమేర సంపాదిస్తున్నానని చెబుతున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లోని పలువురు యువకులు ఫొటోషూట్ కోసం తన తోటల్లోకి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నాడు.

పండుగల వేళలో గిరాకీ ఉంటుంది

రైతులందరం ఒకే రకమైన వరి పంట సాగుచేస్తే మార్కెట్లో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వానకాలంలోనే పంటల మార్పిడి చేసిన. మంచి ఫలితాలు ఉన్నా యి. పంటల మార్పిడి వల్ల భూమికి కూడా మంచిదే. అందుకే నేను వరి, పూలు, కూ రగాయలు, మిర్చి వంటి వివిధ రకాల పంట లను వేసిన. నా మొదటి ప్రయత్నంలోనే సక్సెస్ అవ్వడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ నాలాంటి యువ రైతులకు సబ్సి డీపై డ్రిప్ ఇచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది.

-ఆకుల బుచ్చయ్య రైతు మూడపల్లి (గోస్కులపల్లి) చందుర్తి మండలం

ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యం

సుల్తానాబాద్, డిసెంబర్ 15: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే తమ లక్ష్యమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ఎమాట్-2024 పేరిట మ్యాథ్స్ ఒలంపియా డ్ టెస్టును నిర్వహించగా, విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 517మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పోటీలు నిర్వహణతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందన్నారు.

హామీలు అమలయ్యేనా?

- అమలుకు నోచుకోని అంగన్‌వాడీల ₹18వేల వేతనం పెంపు
- 10నెలలుగా అందని అద్దెలు
- పదోన్నతుల ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు
- టీచర్లు, హెల్పర్ల వేతనం అంతంత మాత్రమే
- గత ప్రభుత్వం పెంచిన జీతాలతోనే సరిపెట్టుకుంటున్న వైనం

గోదావరిఖనిలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట దీక్షకు బైఠాయించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు (ఫైల్)

కోల్‌సిటీ, డిసెంబర్ 15: చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందించడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలలో కూడా తమ సేవలను అందిస్తున్న అంగన్‌వాడీలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆగమాగం అవుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అతీగతి లేదు. పైగా 10 నెలలుగా అద్దెలు రావడం లేదు.. ₹18వేల వేతనం పెంపు ఇంకా హామీగానే ఉండిపోయింది. ఇక పదోన్నతుల ఊసే ఎత్తకపోగా, సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రాలు కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు పెరిగిన వేతనాలతోనే టీచర్లు, ఆయాలు నెట్టుకొస్తున్నారు. టీచర్లు, హెల్పర్ల పదోన్నతుల విషయాన్నే సర్కారు మరిచిపోయింది. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారన్న గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

10 నెలలుగా అద్దెలు బంద్

కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన నాటినుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు రావడం లేదు. జిల్లాలోని ఒక్క రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోనే దాదాపు 200కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అద్దెల భారంతో టీచర్లు నానా ఇబ్బందిపడుతున్నారు. తమ వేతనంలో నుంచి పోనూ ఇంకా బయట అప్పు చేసి అద్దెలు చెల్లిస్తున్నారు. పై అధికారులను అడిగితే రేపోమాపో చెల్లింపులు జరుగుతాయంటూ మాటలతో నెట్టుకొస్తున్నారు. కొన్ని చోట్ల అద్దెలు చెల్లించడంలో ఆలస్యం కారణంగా టీచర్లు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

వేతనాల పెంపు ఊసే లేదు

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు ₹18వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ ఊసేలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు వేతనాలు పెరిగాయి. నాడు టీచర్ల వేతనం ₹7,500 ఉండగా బీఆర్ఎస్ హయాంలో ₹13,500, హెల్పర్ల వేతనం ₹7,800 వరకు పెంచారు. కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే ₹18వేలు చేస్తామని చెప్పడంతో ఆశతో ఓట్లు వేసిన టీచర్లు నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైనా వేతనాలు పెంచాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఆర్థిక ప్రయోజనాలు అంతంతే..

టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. 65ఏండ్లు వయస్సు నిండిన టీచర్లు, హెల్పర్లు ఉద్యోగ విరమణ పొందితే వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. టీచర్‌కు ₹2లక్షలు, హెల్పర్‌కు ₹లక్ష బెనిఫిట్‌గా ఇస్తామని చెప్పింది. అది కూడా సక్రమంగా అమలు కావడం లేదని తెలుస్తోంది. ఇంకా పదోన్నతుల కల్పనలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

రోడ్డెక్కుతున్న టీచర్లు, హెల్పర్లు

గత పదేళ్లలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఏనాడూ రోడ్డెక్కిన దాఖలాలు లేవు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టీచర్లు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టులో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అవకతవకలకు తోడు టీచర్లు, హెల్పర్లపై తీవ్రమైన పని ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని ఆవేదన చెందుతూ ఇటీవల మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలను బంద్ చేసి కార్యాలయ ఆవరణలో దీక్షలు చేపట్టారు. అయినప్పటికీ వారి గోడును వినేవారే కరువయ్యారు.

రోడ్డు పనులు పూర్తయ్యేనా?

- ఆగుతూ.. సాగుతున్న నిర్మాణాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

వెంకట్రావ్‌పల్లి వద్ద కొనసాగుతున్న రోడ్డు పనులు

జూలపల్లి, డిసెంబర్15: జూలపల్లి నుంచి పెద్దపల్లి వెళ్లే ప్రధాన రహదారి పునర్నిర్మాణ పనుల్లో వేగం పెరుగడం లేదు. దాదాపు సంవత్సర కాలం నుంచి డబుల్ రోడ్డు పనులు ఆగుతూ సాగుతూ కొనసాగుతున్నాయి. కాచాపూర్ నుంచి లోకపేట దాకా ఐదు కిలోమీటర్ల రహదారి పనులు ఐదు నెలల నుంచి నత్తనడకన చేపడుతున్నారు. ప్రభుత్వం ₹12కోట్లు మంజూరు చేసింది. రోడ్డుకిరువైపులా చెట్లు తొలగించి అక్కడక్కడా పాతతారును తవ్వి మొరంతో నింపి విస్తరించారు. రోడ్డుపై దుమ్ము,ధూళితో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే జూలపల్లి-కాచాపూర్ వరకు ఏడాది గడిచినా డబుల్‌రోడ్డు విస్తరణ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులకు ₹19కోట్లు మంజూరు చేసింది. రోడ్డుపై కంకర తేలి, పగుళ్లుపడి అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

జ్యోతినగర్ (రామగుండం), డిసెంబర్ 15: ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు ఆరుముళ్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు కాసిపేట ధర్మేందర్ కోరారు. ఆదివారం రామగుండం అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. ఇక్క డ పీవైఎల్ నాయకులు సమ్మెట తిరుపతి, బొంతు ఆనంద్, ఈదునూరి బాబు, తిరుపతి, స్వామి, శ్రీనివాస్‌ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గంభీరావుపేట, డిసెంబర్ 15: మండలంలోని లింగన్నపేటలో 1983-84 సంవత్సర పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాల వేదికగా నలభై ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిశారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులతో వారి మాటలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అనంతరం గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

పొట్టిశ్రీరాములు విగ్రహానికిపూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వేములవాడ, డిసెంబర్ 15 : పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం వేములవాడ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు, జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, పట్టణ కార్యదర్శులు నరాల శ్రీనివాస్, కటుకం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్‌కుమార్, మద్ది సత్యనారాయణ, గుండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 15: సింగారం గ్రామానికి చెందిన వాసరి బాలయ్య(55) మద్యానికి బానిసై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమాకాంత్ వివరాల ప్రకారం, బాలయ్య భార్య పద్మ పదేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి మనస్తాపానికి లోనై మద్యానికి బానిసయ్యాడు. శనివారం తల్లి లక్ష్మి ఇంట్లో భోజనం చేసి తన ఇంటికి వెళ్లిన బాలయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఇరుగు పొరుగువారు చూసి కుటుంబ సభ్యులకు తెలిపారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

బిజినెస్

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పే లోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకు నుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.

హింటిస్తే చాలు అల్లుకు పోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.

తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాములని చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా అవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు.

చివరగా..

పిల్లలు తల్లిదండ్రులను చూస్తూ పెరుగుతారు. కాబట్టి మీరు ఆర్థిక క్రమశిక్షణతో ఉంటేనే మీ పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారన్నది గుర్తుంచుకోవాలి. మీ పొదుపు, మీ పెట్టుబడులు, మీ ఖర్చులన్నీ వారికి తెలిసేలా చేయండి. దీనివల్ల పారదర్శకత కూడా వస్తుంది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఎంత చిన్న వయసు నుంచే ఆరంభిస్తే అంత లాభాలు ఉంటాయన్నది మరువద్దు.

లాభాల స్వీకరణకు అవకాశం!

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కనిపిస్తున్నది. ఒడిదొడుకులు చోటుచేసుకుంటున్నా స్థూలంగా మదుపరులు పెట్టుబడులకే ప్రాధాన్యతనిస్తున్నారు. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 623.07 పాయింట్లు లేదా 0.76 శాతం ఎగబాకి 82,133.12 వద్ద నిలిచింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.50 పాయింట్లు లేదా 0.36 శాతం ఎగిసి 24,768.30 దగ్గర ముగిసింది. అయితే ఈ వారం ఈ లాభాలను మదుపరులు ఒడిసిపట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. కానీ నవంబర్‌లో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. ఫలితంగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దపీట వేసే వీలు కూడా ఉందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ప్రధానం. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,100-25,300 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.